నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 7 సెప్టెంబర్ 2024 | SIDDIPET

## విఘ్నేశ్వరుడి దయతో విఘ్నాలు తొలగాలి

**ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**



సిద్దిపేట, సెప్టెంబర్ 6: సకల కార్యక్రమాలకు ముందు ప్రథమంగా పూజించేది వినాయకుడిని.. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కోరారు. వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నేశ్వరుడి దయతో విఘ్నాలు తొలిగిపోవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి గణపతి ప్రతిమలను పూజించాలన్నారు. మట్టి గణపతే మహాగణపతి అన్నారు.



శుక్రవారం మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలంలో పొంగిపొర్లుతున్న వనదుర్గా ప్రాజెక్టు

# ప్రారంభం ఎప్పుడో ?



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న దౌల్తాబాద్ నూతన ఆరోగ్యకేంద్ర భవనం



శిథిలావస్థకు చేరిన దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం

- **శిథిల భవనంలో వైద్యసేవలు**
- **గదులన్నీ పెచ్చులూడుతున్న వైనం**
- **వర్షపు నీటిలో వైద్య చికిత్సలు**
- **భయంభయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది**
- **సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో అలంకార ప్రాయంగా దవాఖాన నూతన భవనం**
- **వైద్యారోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ జిల్లాలో ఇదీ పరిస్థితి**

హత్నూర, సెప్టెంబర్ 6: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. 10 జనవరి 2023 అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి రూ.కోటి 56లక్షలు మంజూరు చేయించి దవాఖాన నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన వెంటనే పనులు చురుగ్గా కొనసాగాయి. బీఆర్‌ఎస్ హయాంలోనే పనులు పూర్తయ్యాయి. దీంతో భవనం ప్రారంభించే తరుణంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ప్రారంభం నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా దవాఖాన నూతన భవనం ప్రారంభించ లేదు. దీంతో శిథిల భవనంలోనే వైద్యసేవలు కొనసాగిస్తున్నారు. ఇదీ వైద్యారోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ సొంత జిల్లాలో పరిస్థితి. ఇప్పటికైనా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించి మెరుగైన వైద్యసేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

**శిథిల భవనంలో వైద్యసేవలు**

దౌల్తాబాద్ ప్రభుత్వ దవాఖాన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో భవనం పైకప్పు పెచ్చులూడుతున్నది. అంతేకాకుండా చిన్నపాటి వర్షానికే వర్షపునీరు గదుల్లోకి వస్తుంది. దవాఖానలో మందులు నిల్వ ఉంచే గదులుసైతం కురుస్తుండటంతో మందుల ప్యాకెట్లు తడిసిపోతున్నాయి. నిత్యం దవాఖానకు పదుల సంఖ్యలో వచ్చేరోగులకు వైద్యసేవలు అందించడానికి ఇబ్బందిగా మారింది. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్న రోగులకు సెలైన్‌బాటిళ్లు ఎక్కించాలంటే వర్షం కురుస్తున్న గదుల్లోనే చికిత్స చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. శిథిల భవనంలో వైద్య సేవలు పొందడానికి భయపడుతూ కొందరు ప్రైవేట్ దవాఖానలకు వెళ్తున్నారు.

**భయం గుప్పిట్లో...**

భయంతో విధులు నిర్వహించాల్సి వస్తుందని వైద్యసిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం గోడలకు పగుళ్లు ఏర్పడి స్లాబు పెచ్చులూడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపునీటితో గదులన్నీ అపరిశుభ్రంగా మారి క్రిమికీటకాలు సంచరిస్తున్నాయి. మందులు భద్రపర్చడానికి ఇబ్బందిగా మారింది.



దవాఖానలో పెచ్చులూడుతున్న స్లాబు

### దవాఖానకు రావాలంటేనే భయమేస్తోంది



దవాఖాన భవనం పూర్తిగా శిథిలావస్థకుచేరింది. గోడలకు పగుళ్లు ఏర్పడడంతోపాటు పైకప్పు పెచ్చులూడటంతో భయమేస్తోంది. వైద్యంకోసం వస్తే ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన కలుగుతుంది. దవాఖానలోనే ఉండి వైద్యం చేయించుకోవాలంటే ఇక ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవనం ప్రారంభించి దవాఖానను అక్కడికి మార్చాలి. –చంద్రకళ, కాసాల, సంగారెడ్డి జిల్లా

### నూతన భవనం ఎందుకు ప్రారంభిస్తలేరు



లక్షల రూపాయలతో నిర్మించిన నూతన దవాఖాన భవనం ఎందుకు ప్రారంభిస్తలేరో తెలుస్తలేదు. దౌల్తాబాద్ దవాఖానకు పరిసర గ్రామాల ప్రజలు ఎంతోమంది వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పుడు దవాఖానకు రావడానికి భయపడుతున్నారు. గోడలన్నీ పగుళ్లు ఏర్పడి స్లాబు పెచ్చులూడి వర్షపునీటితో అపరిశుభ్రంగా మారింది. వైద్యం చేయించుకోవాలంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. –అమృత, దౌల్తాబాద్, సంగారెడ్డి జిల్లా

### జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లా



నూతన భవనం ప్రారంభించాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లా. గదుల్లో వర్షపునీరు చేరి వైద్యం చేయడానికి ఇబ్బందిగా మారింది. గోడలకు పగుళ్లు ఏర్పడి క్రిమికీటకాలు సంచరిస్తున్నాయి. దవాఖానలో మందులు నిల్వ ఉంచడానికి ఇబ్బందులు పడుతున్నాం. వర్షానికి బెడ్లు తడిసి సెలైన్ ఎక్కించాలంటే ఇక్కట్లు తప్పడం లేదు. – దివ్యజ్యోతి, వైద్యురాలు, దౌల్తాబాద్

### భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్నాం



శిథిల భవనంలో విధులు నిర్వహించాలంటే భయమేస్తోంది. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని వైద్య సిబ్బంది భయపడుతున్నారు. చీమలు, క్రిమికీటకాలతో దవాఖానలో తిరగలేకపోతున్నాం. వర్షపునీటితో గదుల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దవాఖానకు వచ్చే మందులు వర్షానికి తడిసిపోతున్నాయి. అధికారులు వెంటనే కొత్త భవనంలోకి మార్చాలి. – జగదీశ్‌స్వామి, ఫార్మాసిస్టు, దౌల్తాబాద్

# పొంగిపొర్లుతున్న మంజీరా

**జల దిగ్బంధంలో మెదక్ జిల్లా ఏడుపాయల దుర్గా మాత ఆలయం**

పాపన్నపేట్, సెప్టెంబర్ 6: ఇటీవల కురిసిన వర్షాలకు తోడు సింగూరు ప్రాజెక్టు గేట్లు తెరవడంతో మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలంలోని వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. ఏడుపాయల వనదుర్గమాత ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున్న వర్షాలు కురుస్తుండడంతో పాటు సింగూరు ప్రాజెక్టు గేట్లు తెరవడంతో 20వేల క్యూసెక్కుల నీరు ఘన్‌పూర్ (వనదుర్గప్రాజెక్టు) వైపు పరుగులిడుతున్నది. దీంతో ప్రాజెక్టు పైనుంచి పెద్దఎత్తున నీరు దుర్గామాత ఆలయం ముందు నుంచి నిజాంసాగర్ వైపు వెళ్తున్నది. దీంతో అమ్మవారి ఆలయం కొన్ని రోజుల నుంచి మూసివేసి రాజగోపురంలో పూజలు చేస్తున్న విషయం తెలిసిందే. మంజీరా ప్రవాహం తగ్గితే అమ్మవారి ఆలయం పునఃప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ పకడ్బందీ చర్యలు చేపట్టారు.



సింగూరు ప్రాజెక్టు క్రస్ట్ గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద నీరు

# సింగూరుకు తగ్గుముఖం పట్టిన వరద

పుల్కల్,సెప్టెంబర్ 6 : సంగారెడ్డి జిల్లా బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వారం రోజుల నుంచి కొనసాగిన వరద కాస్త తగ్గు ముఖం పట్టింది. గురువారం ప్రాజెక్టు 4,6వ క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు వరద తగ్గడంతో శుక్రవారం సాయంత్రం 4వ గేటు మూసివేశారు.6వ గేటును 1.50 మీటర్ల ఎత్తు లేపి 8142 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా సింగూరు ప్రాజెక్టు వరద నీటితో నిండుకుండలా మారింది. ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు నీటి హెచ్చుతగ్గులను గమనిస్తూ ప్రాజెక్టు వద్దే ఉం టున్నారు. సందర్శకులను ప్రాజెక్టుపైకి అనుమతించడం లేదు.ప్రాజెక్టు వద్ద చేపలపై ఫేమస్ కావడం తో పర్యాటకులు వాటినే ఇష్టంగా తింటారు. ప్రాజె క్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుతం 28.776 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి వస్తున్న వరద 11501 క్యూసెక్కులు కాగా క్రస్ట్ గేటు ద్వారా 8142 క్యూసెక్కులు, అం దులో విద్యుత్ ఉత్పత్తి కోసం 2803 క్యూసెక్కులు, మొత్తంగా అవుట్ ఫ్లో 10945 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

### తెలుగు రాష్ట్రాలకు
# రూ.2 లక్షల విరాళం

**చెక్కులు అందజేసిన మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డి**

రామచంద్రాపురం, సెప్టెంబర్ 6: వరదలతో విలవిలలాడుతున్న రెండు తెలుగు రాష్ట్రాలకు మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డి రూ. రెండు లక్షల ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డికి (తెలంగాణ) రూ. లక్ష, (ఆంధ్ర ప్రదేశ్)కు రూ.లక్ష అందజేయాలని చెక్కులు ఇచ్చారు. భూపాల్‌రెడ్డి అందజేసిన చెక్కులను రెండు రాష్ట్రాల్లో తీవ్రంగా నష్టపోయిన జిల్లాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరదసాయంగా ఆదర్శ్‌రెడ్డి అందజేస్తారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో భారీగా కురిసిన వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూడు, గూడు కోల్పోయిన ప్రజలకు అందరం అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు భారీగా సాయం చేయాలన్నారు. విపత్కర పరిస్థితిలో ప్రతిఒక్కరూ బాధితులను ఆదుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ భూపాల్‌రెడ్డి సాయం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. కష్టకాలంలోనే ప్రతి ఒక్కరూ మానవత్వం చూపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌వీ కోఆర్డినేటర్ కృష్ణకాంత్, మైనార్టీ నాయకులు అజీముద్దీన్, గౌస్, విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో వరద బాధితుల కోసం చెక్కులు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డి

# దుబ్బాకలో ఉద్రిక్తత



దుబ్బాక బస్టాండ్ వద్ద సోలిపేట రామలింగారెడ్డి విగ్రహానికి భూమి పూజ చేసిన బీఆర్‌ఎస్ నాయకులు



దుబ్బాక బస్టాండ్ వద్ద ఆందోళనకు దిగిన కాంగ్రెస్ నాయకులు

- **దివంగత ఎమ్మెల్యేల విగ్రహాల ఏర్పాటుపై రచ్చ**
- **బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల ప్రయత్నాలు**
- **పట్టణంలో భారీగా పోలీస్ బలగాలు మోహరింపు**

దుబ్బాక , సెప్టెంబర్ 6: సిద్దిపేట జిల్లా దుబ్బాకలో దివంగత ఎమ్మెల్యేల విగ్రహాల ఏర్పాటు విషయంపై ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. శుక్రవారం దుబ్బాక బస్టాండ్ వద్ద దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహం ఏర్పా టు కోసం బీఆర్‌ఎస్ నాయకులు భూమి పూజ చేశారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని దివంగత చెరుకు ముత్యం రెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం ఇక్కడే భూమి పూజ చేస్తామనడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. ముందుగానే ముత్యంరెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించామని కాంగ్రెస్ నాయకులు ఆరోపించగా ఉద్యమనేత సోలిపేట రామలింగారెడ్డి విగ్ర హం ఇక్కడే ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేశామని బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీ మధు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయకూడదని, అప్పటి వరకు విగ్రహాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేయవద్దని ఏసీపీ మధు, మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఇరువర్గాల వారికి సూచించి వారిని అక్కడి నుంచి పంపించి వేశారు.



దుబ్బాకలో కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ మధు





చిట్టాపూర్‌లో విషాద ఛాయలు..సంతాపం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, (ఇన్‌సెట్‌లో) సోలిపేట సురేందర్‌రెడ్డి చిత్రపటం

# చిట్టాపూర్‌లో విషాదం

- **రైతు సోలిపేట సురేందర్‌రెడ్డి ఆత్మహత్య**
- **కాంగ్రెస్ సర్కారు తీరుపై గ్రామస్తుల ఆవేదన**

దుబ్బాక, సెప్టెంబర్ 6: పంట రుణం మాఫీ కాలేదని మేడ్చల్ వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట రైతు సోలిపేట సురేందర్‌రెడ్డి(50) ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన స్వగ్రామం సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలం చిట్టాపూర్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్యకు ప్రధాన కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సోలిపేట సురేందర్‌రెడ్డిది పేద కుటుంబమని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల కిందట కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పుడు సాగునీరు లేక పంటలు సాగు సాధ్యం కాక ఉపాధి కోసం ఆయన కుటుంబంతో కలిసి మేడ్చల్‌కు వలస వెళ్లాడన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన పంట రుణమాఫీ జాబితాలో సురేందర్‌రెడ్డి పేరు రాలేకపోవడంతో ఆయన ఆత్మహత్య చేసుకోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోలిపేట సురేందర్‌రెడ్డి తన కుటుంబీకులతో కలిసి మేడ్చల్‌కు వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేటు కంపెనీలో సురేందర్‌రెడ్డి, అతడి భార్య మంజుల పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఒక కొడుకు సుశాంత్ ఉన్నాడు. మూడేండ్లుగా మల్లన్నసాగర్‌తో చిట్టాపూర్ పక్కన ఉన్న కూడవెల్లి వాగులోకి పుష్కలంగా సాగునీరు వస్తున్నది. దీంతో గ్రామానికి చెందిన కమ్మరి నర్సింహులు అనే కౌలు రైతు సురేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డిలకు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అప్పుడప్పుడు సురేందర్‌రెడ్డి సాగు పనులు చూసి వెళ్లేవాడు. మేడ్చల్‌కు వలస పోకముందు సురేందర్ రెడ్డి గ్రామంలో వ్యవసాయంతోపాటు పాడి గేదెలను సాది, వచ్చే ఆదాయంతో బతికాడని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో వారి ఇల్లు కూడా కూలిపోయింది. గ్రామానికి వ్యవసాయం పనుల కోసం వచ్చి వెళ్తుండే వాడని, సురేందర్‌రెడ్డి ఆత్మహత్యపై గ్రామస్తులు, రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతితో విషాదం నెలకొంది.



శుక్రవారం సంగారెడ్డిలో వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న భక్తులు



సిద్దిపేట మార్కెట్‌లో గణేశ్ పండుగ సందడి

# పొంచి ఉన్న ప్రమాదం !



శిథిలావస్థకు చేరిన సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని ముదిమాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ముదిమాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరుబయటే పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

- **ప్రమాదం అంచున సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని ముదిమాణిక్యం పాఠశాల**
- **ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పాఠశాలకు వస్తున్న విద్యార్థులు**
- **విషయం తెలుసుకుని విద్యార్థులను ఇంటికి పంపమని ఆదేశాలు జారీ చేసిన డీఈవో**

పుల్కల్, సెప్టెంబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని ముదిమాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రమాదం అంచుకు చేరింది. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాఠశాల గదుల్లోకి నీళ్లు చేరాయి. పురాతన బిల్డింగ్ కావడంతో స్లాబ్ మొత్తం బీటలుబారి వర్షపు నీళ్లు క్లాస్ రూంలోకి వచ్చి అక్కడి నుంచి బయటకు వస్తున్నాయి.విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పాఠశాలకు వస్తున్నారు. ఎప్పుడు పాఠశాల కూలిపోతుందనే భయం విద్యార్థుల్లో పట్టుకుంది. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల గదులు, నీళ్ల లోపలికి వస్తున్న తీరును గమనించి వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్ డీఈవో వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. దీంతో పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థులను ఇంటికి పంపించాలని ఆదేశాలు జారీ చేయడంతో వారిని ఇంటికి పంపించారు. పాఠశాల భవనం నిర్మించి 70 ఏండ్లు గడిచి పోవడంతో ఈ పరిస్థితి ఎదురైనట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ఇలాగైతే మా పిల్లల భవిష్యత్ ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకొని పిల్లల చదువులకు ఆటంకం కలుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పుల్కల్ మండలం ముదిమాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పైకప్పు నుంచి గదుల్లోకి వస్తున్న వర్షపు నీరు

### ఇబ్బందులు పడుతున్నాం



వర్షాలు పడ్డ ప్రతీసారి విద్యార్థులతోపాటు మేము కూడా చాలా ఇబ్బందులు పడుతున్నాం. పురాతన భవనం కావడంతో స్లాబ్ పెచ్చులూడి క్లాసరూమ్‌లో పడుతున్నాయి. వర్షపు నీరంతా గదుల్లో పారుతుంది. అందుకే విద్యార్థులను ఆరుబయట కూర్చో బెడుతున్నాం. – అజిత్ ప్రసాద్, ఉపాధ్యాయుడు, ముదిమాణిక్యం జడ్పీహెచ్‌ఎస్

### ఆరు బయటే పాఠాలు బోధిస్తున్నాం



వర్షం పడ్డప్పుడు పాఠశాల గదులన్నీ నీటితో తడుస్తున్నాయి. చేసేదేమి లేక విద్యార్థులకు ఆరు బయటనే పాఠాలు బోధిస్తున్నాం. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లాం. జిల్లా అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలి. – అశోక్ కుమార్, ఉపాధ్యాయుడు, ముదిమాణిక్యం జడ్పీహెచ్‌ఎస్

### పాఠశాల బిల్డింగ్ బీటలు వారింది



ప్రభుత్వ పాఠశాల బిల్డింగ్ బీటలు వారింది. దాంతో నీళ్లన్నీ క్లాస్ రూంలోకి వస్తున్నాయి. మా పిల్లలను పాఠశాలకు పంపాలంటేనే భయమేస్తోంది. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే గ్రామానికి నూతన పాఠశాల భవనం మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలి. – మ్యాతరి బాల్‌రాజ్, విద్యార్థి తండ్రి